www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 9 అక్టోబర్ 2024 5

పశ్చిమ గోదావరి

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

వ్యవసాయాధికారి నాగరాజు

ఆచంట : తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు, అధికారులు సూచనలు, సలహాలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు అన్నారు. మంగళవారం ఆచంట మండలంలోని వల్లూరు పంచాయతీ పరిధి మట్లవాని చెరువు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గ్రామ సర్పంచి నేలపూడి బేబి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా రైతులతో కలిసి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వ్యవసాయాధికారి నాగరాజు మాట్లాడుతూ సార్వాలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ప్రస్తుత తరుణంలో వరిపంట ఆశాజనకంగా ఉందని, ఈ సార్వాలో తెగుళ్ళు, పురుగుల ఉధృతి తక్కువగానే ఉందని తెలిపారు. అనవసరంగా పురుగు మందులు పిచికారీ చేయవద్దని సూచించారు. చిరుపొట్ట దశలో పొటాష్ ఎరువును ఎకరానికి 20 కిలోలు వేసుకోవాలని తెలిపారు. రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సిండికేట్ 'టెండర్'..!

నేటితో ముగియనున్న మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

11న దుకాణాల కేటాయింపు, 12న మద్యం అమ్మకాలు ప్రారంభం

ఇప్పటి వరకు 'పశ్చిమ'లో 175 దుకాణాలకు 2,300, ఏలూరు జిల్లాలో 144 దుకాణాలకు 2,400 దరఖాస్తులు

ఎంఎల్ఎల కనుసన్నల్లోనే అంతా అంటూ విమర్శలు

గీత కార్మికులకు దుకాణాల కేటాయింపుపై నాన్చుడు

'మద్యం టెండర్ల దరఖాస్తుల ప్రక్రియ సిండికేట్ వ్యవహారంగా మారిందా.. ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధులు తాము అనుకున్నట్లుగానే వ్యవహారం సాగిస్తున్నారా.. టెండర్ వేయాలనుకునే వ్యక్తులు ముందుగా ఎంఎల్ఎలను కలుసుకోవాలని హుకుం జారీ చేశారా.. దీంతో ఏ మద్యం దుకాణానికి ఎంతమంది టెండర్ వేయాలో.. అందులో ఎవరుండాలో ఎంఎల్ఎలే నిర్ణయించారా.. ప్రతి మద్యం దుకాణంలోనూ ప్రజాప్రతినిధులకు వాటాలు ఇచ్చేలా ఒప్పందాలు జరిగిపోయాయా'.. అంటే అవుననే సమాధానం వస్తోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాలు ప్రభుత్వ దుకాణాల ఆధ్వర్యంలోనే నడిచాయి. సరైన బ్రాండ్లు లేకుండా చేశారని, మద్యం ధరలు విపరీతంగా పెంచేయడం, ఆన్‌లైన్ చెల్లింపులు లేకపోవడం అనేక అంశాలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను పెంచాయి. దీంతో మద్యం అమ్మకాలను ప్రయివేటుకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఈ నెల ఒకటో తేదీ నుంచి మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టింది. తొమ్మిదో తేదీ బుధవారం సాయంత్రం ఆరు గంటలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగియనుంది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలోని 144 దుకాణాలకు 2,400 దరఖాస్తులు రాగా, పశ్చిమగోదావరి జిల్లాలోని 175 మద్యం దుకాణాలకు 2,300 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. చివరి రోజు బుధవారం పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిన తర్వాత 11వ తేదీన టెండర్లు తెరిచి దుకాణాలను కేటాయిస్తారు. 12 నుంచి దుకాణాలను ప్రారంభించే అవకాశం ఉంటుంది.

గీత కార్మికులకు పది శాతం దుకాణాల కేటాయింపు ఏది?

మద్యం దుకాణాల్లో పది శాతం గీత కార్మికులకు కేటాయిస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ ప్రకారం చూస్తే ఏలూరు జిల్లాలో 15, పశ్చిమలో 18 వరకూ దుకాణాలను గీత కార్మికులకు కేటాయించాల్సి ఉంది. ఇప్పటి వరకూ గీతకార్మికులకు దుకాణాల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులనూ విడుదల చేయలేదు. ప్రస్తుతం ఓపెన్ కేటగిరిలో జరుగుతున్న దరఖాస్తుల ప్రక్రియ పూర్తిచేసి, దుకాణాల కేటాయింపు జరిగిన తర్వాత గీతకార్మికులకు సంబంధించిన దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ మొదలవుతుందని చెబుతున్నారు. కల్లుగీతను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఈ వ్యవహారం ముందుకు తెచ్చిందనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. గీత కార్మిలకు కేటాయించిన దుకాణాలపైనా ప్రజాప్రతినిధులు తమ పూర్తి ఆధిపత్యం కొనసాగించేందుకు వ్యూహాలు రచించినట్లు తెలుస్తోంది.

అంతా ఎంఎల్ఎల కనుసన్నల్లోనే..?

ఉచిత ఇసుక సరఫరాలో జనం నుంచి తీవ్ర వ్యతిరేకతను కూటమి ప్రభుత్వం మూటగట్టుకుంది. ఇప్పుడు మద్యం దుకాణాల దరఖాస్తుల వ్యవహారం సైతం జనంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మద్యం దుకాణాల్లో తమకు వాటా కచ్చితంగా ఇవ్వాలంటూ చాలామంది ఎంఎల్ఎలు పట్టుబట్టుకుని కూర్చున్నట్లు చర్చ నడుస్తోంది. ఎంఎల్ఎల కుమారులు, ఎంఎల్ఎల తరపున స్థానిక ప్రజాప్రతినిధులు ఈ తతంగం నడిపిస్తున్నట్లు చెబుతున్నారు. ఈసారి మద్యం దుకాణాల దరఖాస్తులకు సంబంధించి ప్రభుత్వం కొన్ని నిబంధనలను పెట్టింది. దరఖాస్తు చేసిన వ్యక్తులు రూ.రెండు లక్షలు నాన్ రిఫండబుల్ చెల్లించాలని నిబంధన విధించింది. గతంలో ఇది రూ.50 వేలు మాత్రమే ఉండేది. దరఖాస్తు చేసిన తర్వాత టెండర్ దక్కకపోతే రూ.రెండు లక్షలు వదులుకోవాల్సిందే. దీన్ని అదునుగా తీసుకుని ఎంఎల్ఎలు చక్రంతిప్పిన పరిస్థితి ఉంది. ఎవరికి వారే దరఖాస్తు వేస్తే దుకాణం దక్కకపోతే రూ.రెండు లక్షలు కోల్పోవాల్సి వస్తుందని, అలాకాకుండా సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేస్తే బాగుంటుందనే ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. దుకాణం దక్కినవారు మిగిలిన వారికి వాటా ఇవ్వడం, కొంత సొమ్ము ఇవ్వడం వంటి ఒప్పందాలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. దరఖాస్తు చేయాలనుకునే వారంతా ముందుగా తమను కలవాలని ఎంఎల్ఎలు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఏ దుకాణానికి ఎంతమంది టెండర్ వేయాలో ఎంఎల్ఎల కనుసన్నల్లోనే సాగుతున్నట్లు సమాచారం.

దుకాణంలో 40 శాతం ఎంఎల్ఎ, ఆయన అనుచరులకు వాటా ఇచ్చే విధంగా ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. డెల్టాలో దుకాణాల్లో వాటాల వ్యవహారం ముందుగానే తెరపైకిరాగా, తర్వాత మిగిలిన చోట్ల మొదలైనట్లు తెలుస్తోంది. ఏదేమైనా మద్యం దుకాణాలపై ఎంఎల్ఎల పెత్తనం కొనసాగనుందని స్పష్టంగా అర్థమవుతోంది. ఇక అర్ధరాత్రైనా, అపరాత్రైనా మద్యం దుకాణాలు కొనసాగే అవకాశం ఉంటుందని, పోలీసులు అటువైపు వెళ్లే అవకాశం ఉండదనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

ఆచంట మండలంలో..

ప్రజాశక్తి - గణపవరం

అల్పపీడన ప్రభావంతో మంగళవారం గణపవరం పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు వర్షం దంచి కొట్టడంతో రోడ్లు జలమయమయ్యాయి. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వరి, ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికోతలు ప్రారంభమయ్యే దశలో వర్షం, గాలులు వల్ల చేలు పడిపోయే ప్రమాదముందని వరిరైతులు లబోదిబోమంటున్నారు.

ఆచంట: అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం తదితర గ్రామాల్లో భారీవర్షం కురిసింది. దీంతో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీల్లో రోడ్లు ముంపునకు గురై స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పాలకొల్లు : పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం వర్షం దంచి కొట్టింది. వర్షం కారణంగా వ్యాపారాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విజయదశమి వేళ కొద్దిగానైనా రెడీమేడ్ బిజినెస్ ఉంటుందనుకుంటే వర్షం ఆటంకంగా మారిందని రెడీమేడ్ వర్తకులు చెబుతున్నారు.

ఉండి: మండలంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉండి పిహెచ్‌సికి వెళ్లే సీసీ రోడ్డు పూర్తిగా జలమయం కావడంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గణపవరం మండలంలో..

గ్రామసభలో తీర్మానించిన పనుల ప్రారంభానికి శ్రీకారం

జిల్లాలో రూ.51.03 కోట్లతో 423 పనులకు ప్రణాళిక సిద్ధం

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈనెల 14 నుంచి పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గ్రామసభలో తీర్మానించిన అన్ని పనులకు శ్రీకారం చుట్టాలని సూచించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పల్లె పండగ కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో రూ.51.03 కోట్లతో 423 పనులను పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈనెల 14న నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నట్లు చెప్పారు. పల్లె పండగపై ప్రజాప్రతినిధులకు ముందుగా తెలియజేస్తామని అన్నారు. గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలను గ్రామస్తులకు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టబోయే పనుల్లో నూరు శాతం పనులకు పరిపాలన ఆమోదం లభించిందని తెలిపారు. జిల్లాలో రహదారి సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయని, అందుకే బిటి రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్లకు అవసరమైన ఇసుకను పొరుగు జిల్లాల నుంచి రప్పించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రహదారి పనులను వచ్చే ఏడాది జనవరి మాసాంతంలోగా పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బి.నాగేశ్వరరావు, డిపిఒ బి.అరుణశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

నిత్యావసరాల ధరలు తగ్గించాలని ధర్నా

భీమవరంలో..

మొగల్తూరులో..

ప్రజాశక్తి - భీమవరం

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాలనీలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరలు అదుపు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసగించిందన్నారు. కిలో టమోటా రూ.100, ఉల్లిపాయలు రూ.60, పామాయిల్ గతంలో రూ.80 ఉంటే ఇప్పుడు రూ.120కు అమ్ముతున్నారన్నారు. ధరల పెరుగుదల వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక అనేక ఇబ్బందులు పడుతుంటే పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకొచ్చినా నిత్యావసర వస్తువుల ధరల అదుపులో ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టమాటా, ఉల్లిపాయలు, పప్పులు రైతుబజార్లలో అందుబాటులో తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.త్రిమూర్తులు, ఎం.మంగ, కె.అరుణ, గాలి ప్రభావతి, నాగలక్ష్మి, రేణుక, కామాక్షి, ఎర్రంశెట్టి నాగమణి, శ్రీను, పట్నాల రేణుక పాల్గొన్నారు.

మొగల్తూరు: పెరిగిన ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అన్నారు. మండల కేంద్రం మొగల్తూరులోని మసీదు సెంటర్ ప్రాంతంలో సిపిఎం నాయకులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ధరలు పెరిగిపోయాన్నారు. గత నెలలో వంట నూనెపై లీటరుకు రూ.30 ధర ప్రభుత్వం పెంచడం దారుణమన్నారు. ఉల్లి, కాయగూరల ధరలు రెండు రెట్లు పెరిగినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యడ్ల చిట్టిబాబు, వీరా పాండురంగారావు, కొల్లాటి బాబూరావు, బజార్ జట్టు కార్మికులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరంలో సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

నినదిస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం

సామ్‌సంగ్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యాన స్థానిక సామ్‌సంగ్ బ్రాంచి ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించి, కార్మిక చట్టాలను అమలు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. వందలాది మంది కార్మికులు పని చేస్తున్నా యూనియన్ పెట్టుకోవడానికి నిరాకరించడం అంటే కార్మిక చట్టాలను ఉల్లంఘించుతున్నట్లేనని అన్నారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించిన సామ్‌సంగ్ కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక కోడ్‌లను తీసుకొచ్చిందని, దీనివల్ల చట్టాలు నిర్వీర్యమై కార్మికుల కష్టాలు తీవ్రతరమయ్యాయని అన్నారు. ప్రస్తుతం కార్మిక చట్టాల అమలులో ఉన్నప్పటికీ సామ్‌సంగ్ కంపెనీలో ఆ చట్టాలు అమలు కావడం లేదని విమర్శించారు. నెలలు తరబడి సమ్మె చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. పరిశ్రమల అభివృద్ధి కావడం అంటే కార్మికుల కడుపు కొట్టుకుని ఆ పరిశ్రమల్లో పని చేయాలని ఏ చట్టంలోనూ లేదన్నారు. కార్మికుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని అన్ని సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అక్కడ కంపెనీ తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామ్‌సంగ్ కంపెనీ తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, బి.వరలక్ష్మి, గోపాలకృష్ణంరాజు, కలిపిండి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

సాగులో డ్రోన్ల వినియోగం పెంచాలి: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పంటల సాగులో సాంకేతికతను వినియోగించి అధిక లాభాలు పొందేందుకు డ్రోన్ల వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్‌డిఎ, వ్యవసాయ శాఖ, బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంటల సాగులో డ్రోన్ల వినియోగంపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందే ఎస్‌హెచ్‌జిలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పంటల సాగులో సాంకేతికతను అందిపుచ్చుకుని మెరుగైన లాభాలను పొందేందుకు డ్రోన్ల వినియోగాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. డ్రోన్లు వినియోగించి పురుగుమందులు స్ప్రే చేయడం వల్ల తక్కువ మందులు, తక్కువ సమయంతో ఎక్కువ లాభం పొందవచ్చన్నారు. జిల్లాలో ఆరు డ్రోన్లను కోరమండల్ ఫెర్టిలైజర్స్ వారు ఎస్‌హెచ్‌జిలను ఎంపిక చేసి అందజేసిందని, సంబంధిత శిక్షణ పూర్తి చేసుకుని వాటిని వినియోగంలోనికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సుమారు రూ.పది లక్షల విలువైన డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీతో అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల ఎస్‌హెచ్‌జిలకు డ్రోన్ల వినియోగంపై నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ 15 రోజులపాటు శిక్షణ అందజేసి సర్టిఫికెట్‌ను ఇస్తుందని తెలిపారు. తద్వారా మీరే సొంతంగా డ్రోన్ నిర్వహించి ఆదాయాన్ని సంపాదించవచ్చని తెలిపారు. ఒక్కొక్కరికి డ్రోన్ శిక్షణ ఇవ్వాలంటే సాధారణంగా రూ.40 వేలు ఖర్చవుతుందని, అయితే నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ వారు ఒక్కొక్కరికి రూ.25 వేలతోనే శిక్షణ అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జట్టు వెంకటేశ్వరరావు, కెవికె కోఆర్డినేటర్లు డాక్టర్ కె.మల్లికార్జునరావు, కె.శ్రీనివాస్, బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పి.భానుమూర్తి, నైపుణ్య శిక్షణ ట్రైనర్ బి.రాకేష్, డిఆర్‌డిఎ, వ్యవసాయ శాఖాధికారులు, ఎస్‌హెచ్‌జి మహిళలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నదే లక్ష్యం

రూ.150 కోట్లతో 40 సబ్‌స్టేషన్లు నిర్మాణం

ఇపిడిసిఎల్ ఎస్ఇ రఘునాథబాబు

నరసాపురం : విద్యుత్ వినియోగదారులకు లోఓల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్న లక్ష్యంతో జిల్లాలో రూ.150 కోట్లతో కొత్తగా 40 సబ్‌స్టేషన్లు నిర్మించనున్నట్లు ఇపిడిసిఎల్ ఎస్ఇ అలపాటి రఘునాథబాబు చెప్పారు. మంగళవారం నరసాపురం డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొత్తగా ఆర్‌డిఎస్ఎస్ నిధులతో నిర్మించే ఒక్కొక్క 33 కేవీ సబ్‌స్టేషన్లకు సుమారు రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు ఖర్చు అవుతుందన్నారు. ప్రతీ సబ్‌డివిజన్‌లో ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్మిస్తామన్నారు. ఎక్కువ సబ్‌స్టేషన్లను గ్రామీణా ప్రాంతాల్లోనే కడతామన్నారు. జిల్లాలో పిఎం సూర్యఘర్ పథకానికి అనుహ్య స్పందన లభిస్తుందన్నారు. ఇప్పటి వరకు 2,500 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిలో 290 ధరఖాస్తులు సర్వే చేసి 155 మంది వినియోగదారులకు ప్యానల్ బోర్డులు అమర్చామన్నారు. కేంద్ర సబ్సిడీతో ఇళ్లపై ఏర్పాటు చేసే ఈ పథకంలో ఎస్‌సి, ఎస్‌టిలకు పూర్తి రాయితీ ఉంటుందన్నారు. ఏర్పాటు చేసే ప్యానల్ బోర్డులకు రెండేళ్ల గ్యారెంటీ ఉంటుందన్నారు. జిల్లాలో లోఓల్టేజ్ సమస్యపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. గ్రామాలు, పట్టణ శివారుల్లో లోఓల్టేజ్ ప్రాంతాలను గుర్తించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని అదేశాలు ఇచ్చామన్నారు. దీనికి సంబంధించి అన్ని సబ్ డివిజన్లలో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడ లోఓల్టేట్ సమస్య ఉండకూడదన్నదే సంస్థ లక్ష్యమన్నారు. శిధిలావస్థకు 11 కేవీ వైర్ల, ఫీడర్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని ఎడిఇలు, ఎఇలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఇఇ మధుకుమార్, ఎడిఇ ఓంకార్, ఎఇ ప్రభాకరరావులు పాల్గొన్నారు.

అధిక ధరలను నియంత్రించాలి : ఐద్వా

ప్రజాశక్తి - భీమవరం

రోజురోజుకి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఈ నేపథ్యంలో మహిళలకు, చిన్నారులకు పోషకాహార లోపం తలెత్తుతుందని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. భీమవరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం గీత పద్మజ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ రోజురోజుకీ నిత్యవసర వస్తువుల ధరలు పైపైకి చేరుతున్నాయన్నారు. ఇటీవల వంటనూనె ధరలు కిలోకు రూ.15 నుంచి రూ.25 వరకు పెరిగిందన్నారు. కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయని వాపోయారు. ముఖ్యంగా ఉల్లి, టమాటాలు కొనలేని పరిస్థితి ఉందన్నారు. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం ధరల నియంత్రణపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని విమర్శించారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజానీకం అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలు ఏర్పడ్డాయన్నారు. నిత్యవసర ధరలు అధికంగా ఉండడంతో చిన్నారులు, మహిళలు పోషకాహార లోపంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను తగ్గించాలని, లేదంటే ప్రజానీకం ఆగ్రహానికి గురికావడం తప్పదని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో సరిపల్లి జయప్రభ, ఎస్.ఉదయ్ కుమారి, బంకుర యశోద, బి.సరోజ పాల్గొన్నారు.

డిసెంబర్ 4 నుంచి ఎస్ఆర్‌కెఆర్‌లో అంతర్జాతీయ సదస్సు

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మరళీకృష్ణంరాజు

భీమవరం టౌన్ : స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడ్వాన్స్‌డ్ అల్గారిథమ్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఐసిఎఎఎఐ)-2024 పేరిట జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. మంగళవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ, నిశాంత్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ పలు దేశాల నుంచి అంతర్జాతీయ నిపుణులు హాజరవుతున్నారన్నారు. ఈ సదస్సులో అధిక సంఖ్యలో దేశం నలుమూలల నుంచి ఇంజనీరింగ్ అధ్యాపక బృందం పాల్గొని అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కాన్ఫరెన్స్ ప్రముఖ పబ్లిషర్ టైలర్ అండ్ ఫ్రాన్సిస్ అనుబంధంతో జరుగుతుందని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఎంపికకాబడి ప్రజెంట్ చేసిన రీసెర్చ్ పేపర్స్, టైలర్ అండ్ ఫ్రాన్సిస్ బుక్ సిరీస్‌లో ప్రచురణై స్కోపస్ ఇండెక్సింగ్‌కి పంపటం జరుగుతుందని తెలియజేశారు. ప్రపంచం నలుమూలల నుంచి రీసెర్చ్ పేపర్స్ వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి.చంద్రశేఖర్, సిఎస్ఇ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎస్.రామకృష్ణం రాజు, కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ఎన్ వి.జగన్మోహన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాలుర టెన్నిస్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న సిఐ శ్రీనివాస్

పాలకొల్లు : విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను మార్కుల కోసమే కాకుండా ఆరోగ్యం, క్రీడా నైపుణ్యాలపై శ్రద్ధ తీసుకోవాలని పాలకొల్లు రూరల్ సిఐ గుత్తుల శ్రీనివాస్ కోరారు. రెండురోజుల పాటు జరిగే పద్మరాజు స్మారక రాష్ట్రస్థాయి టెన్నిస్ బాలురు, బాలికల పోటీలను సిఐ పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం ప్రారంభించారు. అండర్ 8, 10, 12, 14 సంవత్సరాల బాలురు, బాలికల సింగిల్స్, డబుల్స్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కేవలం మార్కుల కోసమే ఇతర ప్రాంతాలకు పంపుతున్న తల్లిదండ్రులకు భిన్నంగా క్రీడలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు మాట్లాడుతూ ఇంటర్ వరకు విద్యార్థులు టెన్నిస్‌పై శ్రద్ధ పెట్టకపోవడం, తరువాత డిగ్రీలో మొదలు పెట్టడంతో రాష్ట్రస్థాయిలో మెన్ కొరత ఉందని చెప్పారు. దీంతో వెటరన్స్ పోటీల్లో బహుమతులు వస్తున్నాయన్నారు. సంస్థ ఉపాధ్యక్షులు ఆర్.సత్యనారాయణ రాజు, క్షత్రియ పరిషత్ కార్యదర్శి చెరుకూరి సూరిబాబు, ఆర్గనైజర్లు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, కల్యాణ్ పాల్గొన్నారు. మాంటిస్సోరి విద్యా సంస్థల చైర్మన్ కెవి.కృష్ణవర్మ స్వాగతం పలికారు.

అరెస్టులు నియంతృత్వ చర్యలు

దళిత ఐక్యవేదిక అధ్యక్షులు, న్యాయవాది పొట్ల సురేష్

ప్రజాశక్తి - తణుకు

సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న వారిపై కేసులు, నిర్భంధాలు, అరెస్టులు, పోలీస్ నోటీసులు వంటి వాటితో అడ్డుకోవడం నియంతృత్వ చర్యలేనని ఆల్ ఇండియా పూలే, అంబేద్కర్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు, దళిత ఐక్యవేదిక అధ్యక్షులు, న్యాయవాది పొట్ల సురేష్ విమర్శించారు. మంగళవారం కాళ్ల పోలీస్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తణుకులో న్యాయవాది పొట్ల సురేష్‌ను హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో ఉండి టిడిపి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని వందల మంది చూస్తూండగానే అవహేళనగా చించివేయడం జరిగిందన్నారు. అటువంటి ఎంఎల్ఎపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించిన వారిపై, దళిత నాయకులను హౌస్ అరెస్టులు చేసి నియంతృత్వంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రఘురామకృష్ణరాజుపై వెంటనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, అంతేకాకుండా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరైతే తప్పు చేశారో వారి మీద కేసులు పెట్టి అరెస్టు చేయకుండా, జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులపై పోలీసుల అరెస్టులు సరికావని అన్నారు. పలువురు నాయకుల అరెస్టులకు నిరసనగా సంఘీభావం తెలియజేశారు.

తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించాలి

కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి

భీమవరం టౌన్ : భీమవరం పట్టణంలోని స్థానిక 8వ వార్డులో కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ వార్డులలోని చెత్తను ఇంటింటికీ గవర్నమెంట్ వారు అందజేసిన డస్ట్‌బిన్స్ ద్వారా తడి, పొడి చెత్త విడిగా అందజేయాలని కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఎప్పటికప్పుడు డ్రెయినేజీలలో సిల్టును తొలగించేలా, ఖాళీ స్థలాల్లో చెత్తను క్లియర్ చేయడానికి నోటీసులు సంబంధిత యజమానికి జారీ చేయవలసిందిగా సానిటరీ సిబ్బందికి, వార్డు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వార్డు పరిధిలో అధికార కట్టడాలను గుర్తించి నోటీసులు జారీ చేసేలా టౌన్ ప్లాన్ సిబ్బందికి తగు సూచించారు. ఇంజనీరింగ్ సిబ్బందితో మాట్లాడుతూ ఎక్కడైనా లోతట్టు ప్రాంతాలు ఉంటే వెంటనే ఎస్టిమేట్స్ రూపొందించి డ్రెయినేజీ, రోడ్లను వేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. కమిషనర్‌తో పాటు ఈ తనిఖీలో సానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎఇలు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి - ఆచంట

వల్లూరు గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. మంగళవారం వల్లూరు గ్రామంలో సిపిఎం శాఖ మహాసభ ఇందుకూరు సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను సిపిఎం సీనియర్ నాయకులు పిల్లి శ్రీరాములు ఆవిష్కరించారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ కొడమంచిలి నుంచి కట్టుకాల్వ వెళ్లే ముఖ్య డ్రెయినను ఆధునీకరించాలని, డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మహాసభలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వల్లూరు నూతన శాఖ కార్యదర్శిగా బొర్రా ధర్మారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి శ్రీరాములు, తాళం సుబ్బారావు, ఐందుకూరి శారదా దేవి, పి.మోహన్ రావు పాల్గొన్నారు.

నూతన శాఖా కార్యదర్శిగా గంగారావు

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శిగా నాగిశెట్టి గంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందుగా స్థానిక బిసి కమ్యూనిటీ హాల్ వద్ద పార్టీ జెండాను మండల కమిటీ సభ్యులు షేక్ పాపాను ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఎం సీనియర్ నాయకులు ఆర్ఎస్, వలవల శ్రీరామమూర్తిలకు జోహార్లు అర్పించి సంతాపం తెలిపారు. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడారు. నివేదికపై చర్చలు అనంతరం సభ ఏకగ్రీవంగా నాగిశెట్టి గంగారావును పెనుగొండ శాఖ కార్యదర్శిగా ఎన్నుకుంది. మహాసభలో మండల కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, పులిదిండి రామారావు, నీలాపు ఆదినారాయణ, మాదాను నాగేశ్వరరావు, శీలం యేసు పాల్గొన్నారు.

శాఖా కార్యదర్శిగా సత్యవతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

సిపిఎం ఇటుకలగుంట ఏడవ శాఖా మహాసభ మాగంటి చింతారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మహాసభకు ముందు పార్టీ జెండా పాతందిన పెద్దిరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు పాల్గొని మాట్లాడుతూ రానున్న కాలంలో చుట్టుపక్కల గ్రామాల్లో బలమైన ఉద్యమాలు నిర్మించి పార్టీని అభివృద్ధి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శాఖ కార్యదర్శి సత్యనారాయణ గత నాలుగు సంవత్సరాల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. అనంతరం నూతన కార్యదర్శిగా పాలుపురి సత్యవతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నాయకులు కండెల్లి సోమరాజు, శాఖ సభ్యులు కొంపల్లి లక్ష్మి, మల్లిపూడి సీతామహాలక్ష్మి, కాల కంటి భవాని, మాగంటి వెంకటరమణ, పాలుపురి శ్రీనివాస్ మాట్లాడారు.

దుకాణాలకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - నరసాపురం

పురపాలక ఆధీనంలోని కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 41 షాపులకు పాట నిర్వహించగా కేవలం 12 దుకాణాలకు మాత్రమే వ్యాపారులు ఆసక్తి చూపారు. పోటాపోటీగా వేలంపాట జరిగింది. మిగిలిన దుకాణాలకు త్వరలో నోటిఫికేషన్ ఇస్తామని కమిషనర్ అంజయ్య చెప్పారు. ఈ పాటలో ఆర్ఓ రామారావు, ఆర్ నానాజీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నాం

కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూడడం సరికాదు

గరగపర్రు ఎస్‌సిల ఆవేదన

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు గ్రామంలో కులమతాలకు అతీతంగా అంతా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నామని, కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూడడం సరికాదని ఎస్‌సిలు విమర్శించారు. గరగపర్రులో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎస్‌సిలు మాట్లాడారు. అన్ని కులాల ఐక్యతతో ఉండే గ్రామంలో కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు గ్రామ ఎంపిటిసి శంకరం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బాధ్యతగల పదవిలో ఉండి శ్మశాన వాటికను రక్షించాల్సింది పోయి ఆక్రమించుకోవాలని చూడడం సిగ్గుచేటన్నారు. గతంలో శ్మశాన వాటికకు సంబంధించి ఇది ప్రభుత్వ స్థలమని, దీనిని ఎవరూ ఆక్రమించుకోకూడదని, పంచాయతీ అధికారులచే బోర్డు పెట్టించి, తిరిగి అదే స్థలాన్ని ఎంపిటిసి ఆక్రమించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. శ్మశాన వాటిక ఆక్రమణపై ఈనెల 1వ తేదీన ఎంపిటిసి మా సంఘానికి చెందిన వ్యక్తి శ్మశాన వాటిక ఆక్రమించినా హామీ ఇచ్చి వెళ్లారన్నారు. శ్మశాన వాటికను శుభ్రం చేసుకునేందుకు వెళ్లే క్రమంలో ఈనెల 2న బయట వ్యక్తులను తీసుకువచ్చి భీమవరం, తణుకు పోలీసులు రంగంలోకి దిగి గ్రామంలో అలజడి సృష్టించి, కులాల మధ్య చిచ్చు పెట్టే విధంగా ప్రయత్నించారని ఆరోపించారు. ప్రశాంతంగా ఉండే గ్రామంలో కులాల మధ్య గొడవలు పెట్టడానికి ప్రయత్నిస్తున్న ఎంపిటిసిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాది దత్తాల విల్సన్ రాజ్, సత్తాల జీవరత్నం, దొడ్ల యోనా, కోనాల ఎలీషా రావు, కర్రాక ఏసు, సత్తాల యేసు, కె.రాజు, వి.జాన్, డి.రాజేష్, వై.శేఖర్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం బస్టాండ్ వద్ద బుధవారం మార్కెట్ సాయిబాబా గుడి రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మీనరసింహ ట్రేడర్స్, కిరణ్ ట్రేడర్స్ దుకాణాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కాలం చెల్లిన చిల్లీ పౌడర్, గ్రౌండ్‌నట్ ఆయిల్ ప్యాకెట్లు, కిస్మిస్, మొయిదిన శనగపప్పు, సరుకులను గుర్తించారు. ప్యాకింగ్‌లపై తయారీ కేంద్రాల చిరునామాలు, కస్టమర్ కేర్ నెంబర్లు, ఈ-మెయిల్ అడ్రస్‌లు లేకపోవడం గమనించారు. ప్యాక్ చేసిన వస్తువులపై నిబంధనల మేరకు సమాచారం లేనందున పిసి రూల్స్-2011 ఉల్లంఘన ప్రకారం లీగల్ మెట్రాలజీ అధికారులు షాపుల యజమానులపై నాలుగు కేసులను నమోదు చేశారు. తూకంలో తేడాలు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బ్యూటీషియన్ రజియా అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు,ఆచంట

ఆచంట మండలం ఆచంట వేమవరంకు చెందిన బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు, వివాహిత షేక్ రజియా(33) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గ్రామానికి చెందిన బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న షేక్ రజియా(33) మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఉరి వేసుకొని మృతి చెందింది. ఆ సమయంలో తన కుమారుడు, కుమార్తె సమీపంలోని నానమ్మ ఇంటికి కూర తీసుకుని వెళ్లారు. తిరిగి వచ్చేసరికి తల్లి విగతజీవిగా ఉండటంతో వారి కేకలు విని ఇరుగుపొరుగువారు వచ్చి చూశారు. భర్త షేక్ సిలార్ పాలకొల్లులోని బిలెన్ షాపులో పనిచేస్తారు. భర్త షేక్ సిలార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆచంట ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామానికి చెందిన యువకుడిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేక ఏమైనా ఆర్థిక సమస్యలు ఉన్నాయా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆమె కాల్ డేటా ఆధారంగా కేసు రేపు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

రజియా (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రోడ్డేయండి మహాప్రభో..!

ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి - ఆకివీడు

'అమ్మో ఆ రోడ్డా.. బస్సు లేకపోయినా పర్వాలేదు నడిచైనా వెళతాం కాని ఆ రోడ్డులో ప్రయాణం అంటే మా వల్ల కాదు బాబోయ్' అంటూ మండలంలోని పెదకాపవరం గ్రామ ప్రజలు హడలిపోతున్నారు. ఆకివీడు నుంచి గణపవరంకు పెదకాపవరం మీదుగా ప్రయాణించే రోడ్డు అతి దగ్గర మార్గం. ఈ రోడ్లో ఆకివీడు నుంచి గణపవరం వెళ్లేందుకు రోడ్డే సమస్య. పెదకాపవరం నుంచి సరిహద్దు నిడమర్రు మండలం క్రొవిడి గ్రామం వెళ్లాలంటే ప్రాణాలకు తెగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అదొక్కటే కాదు, ఆకివీడు నుంచి గణపవరం, తాడేపల్లిగూడెం, నిడదవోలు మీదుగా రాజమండ్రి వెళ్లేందుకు ఈ మార్గంలో రెండు బస్సులు ఉన్నాయి. ఈ బస్సులను గూడెం డిపో ఏర్పాటు చేసింది. ఈ బస్సులు మండలంలోని కొల్లేటి గ్రామాలకు ఎంతగానో ఉపయోగిస్తున్నాయి. గుమ్మలూరు, చినకాపవరం, పెదకాపవరం, అప్పారావుపేట, కోళ్లపర్రు,

అధ్వానంగా పెదకాపవరం-క్రొవిడి రోడ్డు

తదితర దిగువ కొల్లేటి గ్రామాలకు ఉన్నది ఏకైక బస్సు. ఆకివీడు నుంచి కూడా తాడేపల్లిగూడెం వెళ్లడానికి ఈ బస్సు ఒక్కటే. ఆ బస్సు ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంది. ఈ మార్గంలో పెదకాపవరం నుంచి క్రొవిడి వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్లో భయంకరమైన గోతులు, గొప్పులు, పెద్ద పెద్ద గొయ్యిలు ఉన్నాయి. ఆ రోడ్లో వెళ్లే బస్సు కాని, కారు కాని ఎక్కితే ఉయ్యాల ఊగినట్టే ఉంటుంది. ఏ వాహనం ఏ పక్కకి పడిపోతుందో తెలియక ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఆ వాహనాల ప్రయాణం చూస్తుంటేనే భయమేస్తుంది. ఈ మార్గంగుండా ప్రయాణిస్తే నిండు గర్భిణికి పురుడు వచ్చేస్తుందేమో అనే భయం వెంటాడుతోంది. అయినా సరే ఈ మార్గంలో ప్రయాణించక తప్పదు. ఈ రోడ్లో ప్రతిరోజు కనీసం ఇద్దరు పడిపోవడం, దెబ్బలు తగలడం, ఆసుపత్రిపాలవడం అత్యంత సాధారణంగా మారిపోయింది. సైకిళ్లు, మోటార్ సైకిల్ ప్యాచీలు పడటం కూడా మామూలే. ఇన్ని సమస్యలున్న ఈ రోడ్డు ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. వెంటనే రోడ్డుని పునర్నిర్మాణం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ యమ్మనూరి భవాని శంకరి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. డివిజన్ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆర్‌డిఒకు కలెక్టర్ సూచించారు.

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న ఆర్‌డిఒ

ఆర్‌డిఒగా బాధ్యతల స్వీకరణ

తాడేపల్లిగూడెం ఆర్‌డిఒగా యమ్మనూరి భవాని శంకరి సోమవారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. అనంతపురం జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన యమ్మనూరి భవాని శంకరి ఇంజనీరింగ్‌లో ఇసిఇ పట్టభద్రులు. ఆమె తల్లిదండ్రులు ఉపాధ్యాయులు. వీరు 2022 బ్యాచ్ గ్రూప్ వన్ ఆఫీసర్‌గా ఎంపికై శిక్షణ పూర్తిచేసుకున్న అనంతరం మొదట పోస్టింగ్ ఏలూరు జిల్లా నూజివీడు ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బదిలీలలో ఆమెను తాడేపల్లిగూడెం ఆర్‌డిఒగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామానికి చెందిన పిల్లి సంపత్ కుమార్(23) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందాడు. దాట్ల శ్రీదేవి మోమెరియల్ ట్రస్ట్ చైర్మన్ దాట్ల వెంకట రామరాజు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. పిల్లి సంపత్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ చైర్మన్ దాట్ల వెంకట రామరాజు చేతుల మీదుగా అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. ఏలూరు జిల్లా చింతలపూడిలోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులను మంగళవారం కలిసి రానున్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు ఎంఎల్‌సిగా అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయుల సమస్యలపై శాసనమండలిలో తన గొంతు వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అన్యాయం

ఎస్‌పికి దళిత నాయకుల వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఏలూరుపాడు ఫ్లెక్సీ వివాదంలో మంగళవారం చలో కాళ్ల పోలీస్ స్టేషన్ పిలుపు మేరకు భీమవరం, జిల్లా నలుమూలల ఉన్న ముఖ్య దళిత నాయకులను మంగళవారం తెల్లవారుజాము నుంచి హౌస్ అరెస్టులు చేయడం అన్యాయమని మాల సంఘాల రాష్ట్ర జెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్ మళ్లీ రాజేష్ అన్నారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ జిల్లా ఎస్‌పిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దళితులపై వేధింపులు ఆపాలని వారు కోరారు. ఉండి నియోజకవర్గ ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నల్లి రాజేష్ కోరారు. అనంతరం ఎస్‌పిని కలిసిన వారిలో మాల సంఘాల జెఎసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లి రాజేష్, బహుజన జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరు మధు, గంటా సుందర్ కుమార్ ఉన్నారు.

ప్రజలకు సురక్షిత తాగునీరు

రూ.35 లక్షలతో సంపు, ఫిల్టర్ బెడ్ నిర్మాణం

ప్రజాశక్తి - కాళ్ల

సురక్షిత నీటిని ప్రజలకు సరఫరా చేసే బాధ్యత ప్రభుత్వాలు, గ్రామ పంచాయతీలదే. ప్రస్తుతం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సంపు, ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామీణ ప్రజల ప్రగతికి భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వంతు కృషి చేస్తోంది. పెదఅమిరం గ్రామంలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఫిల్టర్ బెడ్, సంపు ఏర్పాటు చేసింది. ప్రజల కోసం గ్రామపంచాయతీ తాగునీటి అవసరాల నిమిత్తం సుమారు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించే ఫిల్టర్ బెడ్, సంపు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రసాద్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ కో ప్రయివేట్ లిమిటెడ్, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దీని నిర్మాణం చేపడుతున్నారు. రూ.35 లక్షల వ్యయంతో సుమారు 60 వేల లీటర్ల సామర్థ్యంతో సంపు, ఫిల్టర్ బెడ్ల నిర్మాణం

ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యాన నిర్మించిన సంపు, ఫిల్టర్‌బెడ్

జరుగుతుంది. దీంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చెరువు నీటిని సేకరించి, శుద్ధిచేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించనున్నారు. ప్రజలంతా ఆర్వో ప్లాంట్ల ద్వారా ఫిల్టర్ చేసిన నీటిని కొనుగోలు చేస్తున్నారు.

ఆర్వో ప్లాంట్ల ద్వారా కొనుగోలు చేసిన నీటిలో లేనటువంటి మినరల్స్, పోషక విలువలు అందేలా ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేషన్‌కు, ప్రసాద్ అండ్ కో కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిర్మించిన సంపు, ఫిల్టర్ బెడ్‌ల ద్వారా నీరు అందించనున్నారు.

ఎంతో ఉపయోగకరం

డొక్కు సోమేశ్వరరావు, గ్రామ సర్పంచి, పెదఅమిరం

గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు సంపు, ఫిల్టర్ బెడ్ల నిర్మాణం ఎంతో ఉపయోగపడుతోంది. వీటి నిర్మాణం సుమారు రూ.35 లక్షల వ్యయంతో పనులు జరుగుతున్నాయి. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేషన్‌కు, ప్రసాద్ అండ్ కో కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ వారికి కృతజ్ఞతలు.

తాగునీరు వృధా కాకుండా చూడాలి

నీటి సరఫరా విభాగం ఎఇఇ లోకేష్

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా చేస్తున్న సురక్షిత తాగునీరు వృధా కాకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులపై ఉందని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎఇఇ టి.లోకేష్ అన్నారు. ఎపిఎస్ఐఆర్‌డి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులతో ఆయన మాట్లాడారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రక్షిత మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడం, కుళాయిల ద్వారా వచ్చే నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడటం, పైపు లైన్ల లీకేజీని సకాలంలో నియంత్రించడం తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సీతారాపురం సౌత్ ఉప సర్పంచి కూనపరెడ్డి ఏసు మాట్లాడుతూ రక్షిత మంచినీటి సరఫరా విషయంలో గ్రామ పంచాయతీల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. ఒహెచ్ఎస్ఆర్‌లనూ నిర్దేశించిన సమయానికి శుభ్రం చేసి వ్యాధులకు తావులేని సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌బిచర్ల వార్డు సభ్యులు కటకంశెట్టి సుభాకర్ మాట్లాడుతూ లక్ష్మణేశ్వరం భారీ రక్షిత మంచినీటి పథకం చెరువుకు లక్ష్మణేశ్వరం గొల్లల వంతెన వద్దనున్న పంట కాలువ నుంచి పంపింగ్ చేయకుండా నరసాపురం ప్రధాన పంట కాలువ నుంచి నీటిని చెరువులోకి పంపింగ్ చేసి నీటి కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. శిక్షణా తరగతుల్లో ఎల్‌బిచర్ల ఉప సర్పంచి కటకంశెట్టి నరసింహమూర్తి మాట్లాడుతూ తమ గ్రామంలో జనాభాకు అనుగుణంగా రక్షిత మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలన్నారు. మాస్టర్ ట్రెయినీ, కొప్పర్రు గ్రామ కార్యదర్శి బి.ఆనందబాబు, ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

కాళ్ల : గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు ఉండాలని ఎంపిడిఒ జి.స్వాతి అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో వార్డు మెంబర్లకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.స్వాతి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కోసం ప్రణాళిక ఉండాలన్నారు. గ్రామాలలో సీసీ రోడ్లు, కాలువలు వంటి సమస్యలను పరిష్కరించే దిశగా సిద్ధమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎంవి.భాస్కరరావు, ఎఒ ఎంఎస్.ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు బి.సతీష్ కుమార్, మణికంఠ, సుబ్బారావు, సత్యనారాయణలతో పాటు వివిధ గ్రామాల వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గణపవరం : గ్రామాలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషిచేయాలని గణపవరం ఎంపిపి దండు వెంకటరామరాజు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచులకు, ఉపసర్పంచులకు జరిగిన శిక్షణా తరగతులను ప్రారంభించి మాట్లాడారు. శిక్షణా తరగతులలో పాల్గొన్న వారికి ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి, ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ, సరిపల్లి కార్యదర్శి డి.రామాంజనేయులు, మూడవ సచివాలయం కార్యదర్శి ఎ.భాస్కర్, నాలుగో సచివాలయం కార్యదర్శి జి.సతీష్, సాధారణ పరిపాలనపై శిక్షణ ఇచ్చారు.

పాలకోడేరు : గ్రామపంచాయతీల్లో పాలనాపరమైన అంశాలపై సభ్యులు అవగాహన కలిగి ఉండాలని పాలకోడేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.రెడ్డియ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ పాలకవర్గ సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు మండల విస్తరణ అధికారి ఎంవిఎస్.ప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రెడ్డియ్య మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయాల్లో జరిగే ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతీ దానిపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. ముఖ్యంగా పాలనాపరమైన అంశాలను తెలుసుకోవడం ద్వారా గ్రామ పరిపాలన సులభతరం అవుతుందన్నారు. అనంతరం ఇఒపిఆర్‌డి ప్రసాద్ వివిధ అంశాలపై పాలకవర్గ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా తరగతుల్లో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పంచాయతీ పాలనపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీ పాలనపై రెండు రోజుల శిక్షణా తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టం, ఆర్థిక వనరుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, టిఒటి రాజు, సమన్వయకర్తగా గంటా సుబ్బారావు పాల్గొన్నారు.

ఉండి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేర్చడంలో ప్రజా ప్రతినిధులదే కీలకపాత్ర అని ఉండి ఎంపిడిఒ శిష్ఠు రవీంద్ర అన్నారు. రెండు రోజులపాటు వార్డు సభ్యులకు, ఉపసర్పంచులకు నిర్వహించే శిక్షణా తరగతులు మంగళవారం వెలుగు కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పంచాయతీ పాలనలో సామర్థ్యాన్ని పెంచేందుకు శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ చట్టాల్లో వచ్చిన మార్పులు, పాలనలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా ఏలూరులో తొలుత శిక్షణ ఇచ్చారన్నారు. వాటి సారాంశాన్ని ఈ శిక్షణా తరగతుల్లో తెలియజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆచంట : రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యచరణ ప్రణాళిక 2024-25 ప్రకారం మండలంలో ఉప సర్పంచులకు, ప్రతి గ్రామ పంచాయతీలోని ఇద్దరు వార్డు సభ్యులకు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీకర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామపంచాయతీలో పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్‌లు, బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, గ్రామపంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు, విద్యుత్ బిల్ నిర్వహణ, పంచాయతీ ఆర్థిక నిర్వహణ కోర్టు కేసుల్లో న్యాయపరమైన అంశాలపై అవగాహనా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

పెనుమంట్ర : గ్రామ సౌభాగ్యం, అభివృద్ధి కోసం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిర్దేశించిన కార్యాచరణ చేయాలని స్థానిక ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఇవిఎస్‌వి.శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణచెర్వు మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్‌లో జరిగిన మండల గ్రామ పంచాయతీల ఉప సర్పంచి, ఇద్దరేసి వార్డు సభ్యుల తొలిరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో సానిటేషన్, రక్షిత మంచినీరు, నీటి పారుదల, ప్రజారోగ్యం వంటి కీలకమైన అంశాల గురించి, తీసుకోవలసిన చర్యల గురించి మాస్టర్ ట్రెయినీలు శిక్షణ ఇచ్చారు. రెండో రోజు శిక్షణలో మండలంలోని 18 గ్రామాల ఉపసర్పంచులు, 36 మంది వార్డు సభ్యులు పూర్తిస్థాయిలో హాజరు కావాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కోరారు.

మండల విస్తరణాధికారి బదిలీ

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండల విస్తరణ అధికారి ఎం.రామకృష్ణారెడ్డి బదిలీపై తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం వెళ్లారు. ఎన్నికల విధుల్లో భాగంగా కపిలేశ్వరపురం నుంచి ఉండి వచ్చిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా కపిలేశ్వరపురం వెళ్లడంతో మంగళవారం సాయంత్రం మండల అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా అన్ని విధాల తనకు సహకరించిన పంచాయతీ కార్యదర్శులకు, తన తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రామకృష్ణారెడ్డిని సత్కరించిన వారిలో పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ సంక్షోభాన్ని నివారించాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - పెంటపాడు

దేశంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అన్నారు. ఎస్‌టివిఎన్ హిందూ హైస్కూల్‌లో ఈనెల 8, 9వ తేదీల్లో జరుగు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ అధ్యక్షతన మంగళవారం ప్రారంభించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు పాల్గొని మాట్లాడుతూ రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగి, వ్యవసాయం లాభసాటి లేక ఈ దేశంలో గంటకు ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని వారు వాపోయారు. కేంద్రంలో నరేంద్ర మోడీ 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, వ్యవసాయం సంక్షోభంలో పడిందని వారు విమర్శించారు. కేరళ తరహాలో వ్యవసాయ మద్దతు రేటు కానీ, పంట రుణాలు కాని ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు రైతుల ఆదుకోవాలని, మిగిలిన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండలం అధ్యక్ష, కార్యదర్శులు చిర్ల పుల్లారెడ్డి, కరక వెంకట్రావు, కె.తవిటి నాయుడు, పెనగంటి దుర్గా సుబ్బరాజు, అడప ఆంజనేయులు, జక్కంపూడి పెంటారావు, సూర్యారావు, ఆకుమూరి శీను, లింగంపల్లి రవితేజ, గొర్రెల అప్పాజీ, మాదాసు శ్రీను, తాడి సుబ్బయ్య పాల్గొన్నారు.

శాఖా కార్యదర్శిగా వెంకటస్వామి

ప్రజాశక్తి - పాలకోడేరు

మొగల్లు గ్రామ సిపిఎం శాఖా కార్యదర్శిగా పాల వెంకటస్వామి ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన శాఖా మహాసభలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గ్రామ శాఖ మహాసభలో గ్రామాభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేసినట్లు వెంకటస్వామి తెలిపారు. గ్రామంలో ప్రజలకు తాగునీరు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత పేటల్లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను తక్షణం నిర్మించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో గ్రామాభివృద్ధి కోసం ఉద్యమిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటస్వామికి పలువురు అభినందించారు.

శాఖా కార్యదర్శులుగా భాస్కరరావు, ఆంజనేయులు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామం అరుంధతి పేట సిపిఎం 1వ శాఖ, 8వ శాఖా కార్యదర్శులుగా చెట్టిమి భాస్కరరావు, మొమ్మిడివరపు ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అరుంధతిపేటలో నిర్వహించిన శాఖ మహాసభలు తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి అధ్యక్షులుగా వ్యవహరించారు. ముందుగా సభల ప్రారంభ సూచికగా పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు తెన్నేటి సంపత రావు ఆవిష్కరించగా, ఇటీవల మృతిచెందిన సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ఎంఎల్‌ఎ ఆర్ఎస్, వలవల శ్రీరామ్‌మూర్తి, (బాబాయ్) తెన్నేటి తాతయ్య, చిట్టి చెట్టిమి బాబురావు, యాంగ్ర మహాలక్ష్మమ్మ తదితరులకు సంతాపాన్ని తెలిపారు. అనంతరం శాఖ కార్యదర్శులు తెన్నేటి నాగరాజు, మొమ్మిడివరపు ఆంజనేయులు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా సభ్యులంతా ఆమోదించారు. ఈ మహాసభల పరిశీలకులుగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిపిఎం సీనియర్ నాయకుడు దేవ సుధాకర్‌లు వ్యవహరించారు. శ్మశాన సమస్యను పరిష్కరించాలని, స్థానిక అరుంధతి పేటలో సీసీ రహదారులు, డ్రెయిన్లు, కరెంటు, వాటర్ సమస్యలను పరిష్కరించాలని తీర్మానించారు.

యాత్రికులకు ప్రసాదం పంపిణీ

మొగల్తూరు : మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో శరన్నవరాత్రుల ఉత్సవాలు పురస్కరించుకొని చక్కర పొంగలి, పులిహోర, క్షీరాన్నం, పళ్ల తదితర ప్రసాదాలను యాత్రికులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన అద్దేపల్లి కొండలరావు, రాధిక దంపతులు, అద్దేపల్లి నరసింహారావు అనూష దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు - నూజివీడు లో

ఇ.పి.నెం. 19/2015 ఇన్ యల్.ఏ.ఓ.నెం. 22/2011

బిట్వీన్:
చాగంటి సుబ్బారావు ...డి.హెచ్.ఆర్/క్లైమెంట్
ది రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్,
నూజివీడు ...జే.డి.ఆర్

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి పై తెలిపిన **జే.డి.ఆర్.** యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వుండి పై తెలిపిన **జే.డి.ఆర్.** గారి కార్యాలయంలో ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు చార్జి కాబడి, వేలం కావలసియున్న చరాస్థి వివరం:
1. 5 - ఐరన్ బీరువాలు - రూ. 15,000/-
2. 10 - ఫైబర్ కుర్చీలు - రూ. 2,500/-
మొత్తం రూ. 17,500/-
డి.హెచ్.ఆర్ విలువ రూ. 17,500/-
అమీనా విలువ రూ. 7,500/-

పైన తెలిపిన ఆస్తిని శ్రీ కోర్టు వారు ది. 17-10-2024 వ తేదీన ఉ.గం. 10-30 ని.ల బహిరంగ వేలం వేయుదురు. కావున కావాల్సినవారు పాడుకొనవచ్చును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యమ్. రమేష్
నూజివీడు డి.హెచ్.ఆర్.తరపు న్యాయవాది
ది.08-10-2024 నూజివీడు
సెల్: 94402 57636